క్లుప్తంగా

నేడు రంజాన్ ప్రార్థనలు

శ్రీకాకుళం కల్చరల్: రంజాన్ పండగకు ముస్లింలు సిద్ధమయ్యారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన వారంతా గురువారం ఈదుల్‌ఫితర్ (రంజాన్) జరిపేందుకు సన్నద్ధమయ్యారు. ముఫ్తీ జియావుల్ రెహమాన్, ఇమామ్ అబ్దుల్ వహాబ్‌ల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని జామియా మసీదు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మహిబుల్లాఖాన్, అక్బర్ బాషాలు తెలిపారు. అందరూ 8–30 గంటలకు హాజరుకావాలని కోరారు.

ట్రాఫిక్ పోలీసులకు వరం చారిటబుల్ ట్రస్ట్ వితరణ



సిబ్బందికి క్యాప్స్, చలువ అద్దాలు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ట్రాఫిక్ పోలీసులు వేసవి తాపాన్ని తట్టుకుని విధులకు నిర్వర్తించేలా క్యాప్స్, చలువ కళ్లద్దాలు, వాటర్ బాటిళ్లను వరం చారిటబుల్ ట్రస్ట్ వితరణ చేసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 70 మంది ట్రాఫిక్ పోలీసులకు ఎస్పీ రాధిక చేతుల మీదుగా ట్రస్ట్ సభ్యులు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సేవలను ఎస్పీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, అంధవరపు ప్రసాదరావు, సంతోష్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అవతారం పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

జి.సిగడాం: శ్రీకాకుళం–విజయనగరం సరిహద్దులోని ఉల్లివలసలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మండల రిటర్నింగ్ అధికారి ఉమామహేశ్వరరావు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనుమానం వచ్చిన ప్రతీ వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ఏఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

గార: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రతీ నెల పదో తేదీన వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చే గర్భిణులకు సత్యసాయి బాబా భక్తులు నారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం అందజేస్తుంటారు. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం పీహెచ్‌సీలో గోరువానిపేట సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోరువానిపేట, బోరవానిపేట సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



హతమార్చిన కొండచిలువ

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం పంచాయతీ పరిధి చినరావుపల్లిలోకి బుధవారం చొరబడిన కొండచిలువను యువకులు కర్రలతో కొట్టి చంపేశారు. పక్కనే ఉన్న జీడితోటల నుంచి కొండచిలువ గ్రామంలోకి వచ్చినట్లు స్థానికులు తెలిపారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత



ఎస్‌ఎంపురంలో నిర్మాణం చేపడుతున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్‌ఎంపురం ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన స్థలంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని తహసీల్దార్ శ్యాంకుమార్, ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవికి ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ బుధవారం ఫిర్యాదు చేశారు. పాఠశాలకు 1985లో కొంతమేర స్థలం కేటాయించగా.. ఐదు సెంటల్లో అక్రమంగా కొందరు నిర్మాణం సాగిస్తున్నారన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు నిలిచిపోయిన నిర్మాణం మళ్లీ బుధవారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు అధికారులు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి పనులు నిలిపివేశారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు నిర్మాణం చేపట్టవద్దని ఇప్పటికే ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ స్థలాన్ని సర్వే నిర్వహిస్తామన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

శ్రీకాకుళం క్రైమ్: ఆరంగివీధిలో కిరాణాషాపు నడుపుతున్న ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. షాపులో పొట్నూరి మణికంఠ మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో సిబ్బంది వెళ్లి పట్టుకున్నారని ఎస్‌ఐ తెలిపారు.

గార: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం జొన్నలపాడు జంక్షన్ వద్ద అక్రమ మద్యం పట్టుకున్నారు. మంగళవారం రాత్రి పవన్‌కుమార్ అనే వ్యక్తి నుంచి 30 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎఫ్‌సీటీ బృందం తెలిపింది. ఎస్సై కె. కృష్ణప్రసాద్ కేసు నమోదు చేశారు.

బూత్ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలి

• మంత్రి ధర్మాన ప్రసాదరావు



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, చిత్రంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యులు సమర్థవంతంగా పని చేయాలని శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, రెవెన్యూశాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. మండలంలోని అంపోలు పంచాయతీ లింగాలవలస సమీపంలోని ఓ తోటలో గార మండల పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున క్షేత్రస్థాయిలో ఇప్పటికే ఉన్న బూత్‌కమిటీసభ్యులు మరింత సమర్థవంతంగా పనిచేయాలి, ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. నియోజకవర్గంలో వేలాదిమంది కార్యకర్తలు ఉండటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను గత ఐదేళ్లలో ప్రజలకు అందించామన్నారు. రైతులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. అర్హులందరికీ స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టామన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టీడీపీ నాయకుడు చంద్రబాబు చెబుతున్న మాయమాటలను నమ్మవద్దని కోరారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి శ్రీకాకుళం జిల్లాకు ఏమి చేశారో చెప్పాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో పలాస కిడ్నీ ఆస్పత్రి, మూలపేట పోర్టు, వంశధార ఎత్తి పోతల పథకాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి రాజశేఖరరెడ్డి హయాంలో రిమ్స్, పది బ్రిడ్జిలు, వంశధార ప్రాజెక్టు, యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. అభివృద్ధి చేశాము కాబట్టే ధైర్యంగా ఓట్లను అడుగుతున్నామని చెప్పారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లను రెండూ ఫ్యాన్ గుర్తుకే వేయాలని పిలుపునిచ్చారు. కావాలనే కొందరు తగువులు పెట్టాలని చూస్తున్నారని, కులం పేరిట రాజకీయాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని అలాంటి వాటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

నన్ను ఆశీర్వదించండి : ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

ఎంపీ అభ్యర్థిగా తనను పార్టీ అధిష్టానవర్గం నిలబెట్టిందని.. అందరూ ఆశీర్వదించి మీ కుటుంబంలో చేర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులను పేరాడ తిలక్ కోరారు. గ్రామాల్లో అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. కేవలం రోడ్డు పక్కన బస్‌షెల్టర్ కట్టి తన పేరు రాసుకుంటున్న టీడీపీ ఎంపీ అభ్యర్థిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బూత్‌కమిటీ నియోజకవర్గ కన్వీనర్ అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ పీస గోపి, మామిడి శ్రీకాంత్, చల్ల రవికుమార్, బరాటం నాగేశ్వరరావు, ముంజేటి కృష్ణమూర్తి, మధురెడ్డి, పీస శ్రీహరిరావు, అరవల రామకృష్ణ, అందవరపు బాలకృష్ణ, కొయ్యాన నాగభూషణం, బి.ఎర్రన్న, యాళ్ల నారాయణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, ఆరంగి రమణమూర్తి, టి.అప్పలరాజు, గొండు జయరాం, గొలివి వెంకటరమణమూర్తి, వప్పంగి గొండు కృష్ణ, శిమ్మ ధర్మరాజు, మార్పు రమణ, సుంకాన సురేష్, ఆరంగి సూర్య, గుజ్జల అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు పాల్గొన్నారు.

భర్త తరఫున భార్య ప్రచారం



ఇంటింటా ప్రచారంలో ధర్మాన సతీమణి గజలక్ష్మి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు తరఫున భార్య గజలక్ష్మి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మండల పరిధిలోని బలివాడ గ్రామంలో ఆమె ఇంటింటా ప్రచారం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీకాకుళం నియోజకవర్గం అభివృద్ధి చెందడానికి ప్రసాదరావే కారణమన్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, మూకళ్ల సుగుణ, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ కృష్ణ, స్థానిక సర్పంచ్ గంగు నరేంద్రకుమార్, ఇప్పిలి బాబు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



ఎచ్చెర్ల క్యాంపస్: రాజీనామా లేఖలతో తోటపాలెం వలంటీర్లు



రణస్థలం: రాజీనామా చేసిన తెప్పలవలస వలంటీర్లు



జి.సిగడాం: రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న జాడ గ్రామ వలంటీర్లు



గార కె.మత్స్యలేశంలో సెక్రటరీకి రాజీనామాలు అందజేస్తున్న వలంటీర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో 29 మంది, చిలకపాలెంలో 25 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఆయా గ్రామ కార్యదర్శులకు రాజీనామా లేఖలు అందజేశారు. స్థానిక నాయకులు కళ్లేపల్లి తిరుపతిరావు, డొంక వెంరటరమణ ఉన్నారు.

జి.సిగడాం: మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీఓ కె.వెంకన్నబాబుకు 30 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందించారు. జాడ గ్రామ వలంటీర్లంతా ఓకేసారి రాజీనామా చేశారు.

రణస్థలం: మండలంలోని కోటపాలెం, కొచ్చెర్ల, తెప్పలవలస గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బస్వ దురుగుబాబు, దన్నాన హరి, శ్రీరాములు, కొయ్య సోముల రెడ్డి, గొర్లె జగదీష్, తదితరులు ఉన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక, చిన్నమురపాక సచివాలయాల పరిధిలోని వలంటీర్లు రాజీనామాలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలి శ్రీనివాసనాయుడు, పైల లక్ష్మణరావు, వండాన సిమ్మినాయుడు తదితరులు ఉన్నారు.

గార: మండలంలోని 26 సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. బుధవారం ఉదయం నుంచి వలంటీర్లు ఆయా సచివాలయాల సెక్రటరీలకు రాజీనామాలు అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వలంటీర్లుగా వీళ్లంతా ఉత్తమ సేవలందించి, ప్రజల నుంచి మన్ననలతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారు. కె.మత్స్యలేశం, కళింగపట్నం, తోనంగి, కొర్ని, కొర్లాం, రామచంద్రాపురం తదితర పంచాయతీల సచివాలయాల వలంటీర్లు రాజీనామాలు ఆమోదం పొందాయి. మండల వ్యాప్తంగా 493 మంది వలంటీర్లు ఉండగా.. అందరం రాజీనామా చేశామని వలంటీర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ఇంటింటా ప్రచారంలో రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు కోరారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు ఇస్తున్న మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని సిలగాం సింగువలస గ్రామంలో బుధవారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా.. మాట్లాడుతూ భవిష్యత్ గ్యారంటీ పేరున టీడీపీ నాయకులు ఆడుతున్న మాయమాటలు నమ్మవద్దన్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో టీడీపీ నాయకులకే గ్యారంటీ లేదన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నవరత్నాలు కావాలన్నా.. మన భవిష్యత్‌లు బాగుండాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టి జనార్దనరావు, కంచు వసంతరావు, చిట్టి రవికుమార్, గేదెల శంగల్వరావు, చిట్టి లక్ష్మణరావు, కుంచాడ భాస్కరావు, కుంచాల సురేష్, నక్కరాము, కంచు త్రినాథరావు, కంచు శ్రీను, బగాది మనోజ్‌కుమార్, బొబ్బాది చంద్రమౌళి, బోర చంటి ఉన్నారు.

ఏపీ బేవరేజస్ గొడౌన్ పరిశీలన




ఏపీ బేవరేజెస్ గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎచ్చెర్ల క్యాంపస్: మద్యం విక్రయాలు, సరఫరా నిబంధనల మేరకు జరగాలని జిల్లా ఎన్నికలు అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గొడౌన్, తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం పరిశీలించారు. బేవరేజెస్ గొడౌలోని మద్యం నిల్వలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గత ఏడాది అమ్మకాలు కంటే 30 శాతం దాట కూడదని, స్టాక్ రిజిస్టర్, సేల్స్ రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. కచ్చితంగా సమయం పాటించాలని, నిబంధనలు మించి బల్క్ అమ్మకాలు జరగకూడదన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ డివైజ్‌లు అమలు చేయాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్న బార్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు

శ్రీకాకుళం: రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి మొదటి, రెండవ సంవత్సర పరీక్ష ఫలితాలు త్వరలో విడుదలవుతున్న నేపథ్యంలో మార్కులు తక్కువచ్చాయనో, ఉత్తీర్ణత సాధించలేదోనన్న ఆత్మన్యూనతా భావాలతో విద్యార్థులు ఎటువంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీవ్ర నిర్ణయాలు తీసుకుంటే తల్లిదండ్రులకు శోకం మిగిల్చడం తప్ప సాధించేది ఏదీ ఉండదని గుర్తుంచుకోవాలన్నారు.

పరామర్శ..




పరామర్శిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎచ్చెర్ల: చిన్నమురపాక గ్రామానికి చెందిన లంక అప్పారావు కుటుంబాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఈయనకు చెందిన 4 ఎకరాల సరుగుడుతోట అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైంది. పరామర్శించిన వారిలో రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు చిరుపురపు రాంబాబు ఉన్నారు.

ప్రార్థనా స్థలాల్లో ప్రచారం చేయరాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజకీయ నాయకులు దేవాలయాలు, చర్చిలు, మసీదులు సందర్శించినప్పుడు కుల, మత ప్రస్తావన తీసుకురాకూడదని, రాజకీయ ఉపన్యాసాలు చేయరాదని శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి రంగయ్య స్పష్టం చేశారు. అలాగే పార్టీకి సంబంధించిన గుర్తులు, స్టిక్కర్లు, కండువా, జెండాలు వాడరాదని, ఓటువేయమని అడగకూడదన్నారు. బహుమతులు పంచరాదని, ఎటువంటి వాగ్దానాలు చేయరాదని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలన్నారు.

బంగారుపూలతో సీతారాములకు పూజలు



పూజలందుకున్న సీతారామచంద్రులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలకు బంగారు పూలతో పూజలు నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో జి.గురునాథరావు తెలిపారు. 15వ తేదీన పందిర రాట మహోత్సవం, 17న శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ జనన పారాయణ ఉంటుందన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా కనుమూజు పూర్ణచంద్రరావుచే హరికథ, 18న సాయంత్రం సంగీత విభావరి, 19న స్వామివారికి కల్యాణ వేడుకలు జరుగుతాయని, 21న స్వామివారికి తిరువీధి, 23న శ్రీరామ పట్టాభిషేకం జరుగుతాయని తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



బొంతుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎచ్చెర్ల: ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. లావేరు మండలంలోని బుడుమూరు, బెజ్జిపురం, బొంతుపేట పంచాయతీల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్తున్నప్పుడు దారిలో కలిసిన ఉపాధి వేతనదారులను కలిసి వారితో మాట్లాడి సంక్షేమ పథకాల కోసం వివరించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర సతీమణి శ్రీదేవి, రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, బొంతు సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు లుకలాపు శ్రీను, అలుపన రమణమ్మ, పెదనాయిని చిట్టిబాబు, బొడ్డ రవిబాబు, కింతలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని మహాత్మా జ్యోతిరావు పూలే న్యాయ కళాశాల కోర్స్ కోఆర్డినేటర్ వై.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. న్యాయ కళాశాలలో బుధవారం ఎల్ఎల్‌బీ మూడేళ్ల విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదిగా రాణించాలన్నా, న్యాయ శాఖలో అధికారిగా ఉద్యోగం సాధించాలన్నా సబ్జెక్టుపై పట్టు, ఇంగ్లిష్ పరిజ్ఞానం రెండూ కీలకమన్నారు. సమాజంలో న్యాయవాదులకు ప్రత్యేక గౌరవం ఉంటుందన్నారు. సుప్రీ కోర్టు, హైకోర్టుల తీర్పులు, కేస్ స్టడీసలను అధ్యయనం చేయాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు జె.కె.ఎల్.సుజాత, జయలక్ష్మి, టంకాల బాలకృష్ణ, మన్మథరావు, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా కామర్స్ క్లబ్ వార్షికోత్సవం



కామర్స్ క్లబ్ వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కామర్స్ క్లబ్ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ విభాగం కోర్సు కోఆర్డినేటర్ నీలం సంతోష్ రంగనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు సాధించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.అచ్యుతరావు, తారకేశ్వరరావు, కరుణానిధి, సంతోషిపావని, చిన్నసుబ్బారావు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి

• సీఐ సన్యాసినాయుడు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

గార: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రజలంతా శాంతియుతంగా జరిగేందుకు సహకరించాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం శ్రీకూర్మం పంచాయతీ పడపానిపేట గ్రామంలో యువత, మహిళలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎటువంటి గొడవలు పడినా చట్టపరంగా గట్టిగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయం వరకూ ఎన్నికల సిబ్బందికి, పోలీసులకు సహకరించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ ప్రభుత్వ అధికారుల బాధ్యతని, ఎటువంటి ప్రలోభాలకు ఓటర్లు లొంగవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.కృష్ణప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులతో పాటు సచివాలయ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

తగాదాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైమ్: ఎన్నికల నేపథ్యంలో ఎవరూ తగాదాలకు దిగవద్దని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లేలా అలజడులు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బుధవారం రాత్రి స్థానిక పెద్దరెల్లి వీధి యువత, పెద్దలు, మహిళలతో సీఐ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కులం మాటున రాజకీయాలు చేసి చాలామంది మిమ్మల్ని వాడుకుంటారని, విజ్ఞతతో ఆలోచించి గొడవలకు ఆమడదూరంలో ఉండాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దన్నారు. మద్యం, లెక్కకు మించిన నగదు, ఇతర మత్తు పదార్థాలు అక్రమదారుల్లో విక్రయిస్తే కేసులు తప్పవన్నారు. ప్రచారాలు ఊపందుకున్న సమయం కావడంతో ఎవరూ ఎటువంటి భావోద్వేగాలకు గురికావద్దన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే బైండోవర్లు, రౌడీషీట్లు తెరుస్తామని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ హరికృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు



జి.సిగడాం తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జి.సిగడాం: ఎన్నికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. బుధవారం జి.సిగడాం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. గత ఎన్నికల కంటే ఈ సారి పోలింగ్ శాతం పెరగాలన్నారు. ఎన్నికల కోడ్ అమలుపై నిఘా పెంచాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల వద్ద అనుమతి లేకుండా జెండాలు పెడితే చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల రవాణా సౌకర్యం, మౌలిక సదుపాయాలపై మండల రిటర్నింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొబ్బూరులోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి.లక్ష్మణమూర్తి, అధికారులు వెంకన్నబాబు, అరసాడ రవి, ఆర్ఐ రామచంద్రరావు, భూపతి నర్సింగరావు, ఎస్ఐ మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.